క్లుప్తంగా

బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటాం

ప్రొహిబిషన్ సీఐ రవి కుమార్



వేమూరు: 'బెల్టు' తీయరు.. పట్టించుకోరు పేరిట మంగళవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందిస్తూ ప్రొహిబిషన్ సీఐ రవి కుమార్ వివరణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వేమూరు ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలోని వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో మద్యం బెల్టు షాపులు కొనసాగుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. బెల్టు షాపుల నిర్వాహకులపై వేమూరు మండలంలో 7 కేసులు నమోదు చేసి, 7 మందిని అరెస్ట్ చేసి 97 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అమర్తలూరు మండలంలో 5 కేసులు నమోదు చేసి 60 మద్యం సీసాలు, చుండూరు మండలంలో 3 కేసులు, 33 మద్యం సీసాలు, కొల్లూరు మండలంలో 7 కేసులు, 87 సీసాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందన్నారు. బెల్టు షాపుల నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వేమూరు ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలోని బెల్టు షాపులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఏఈ ఎం.శాంత కుమారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా గొరిగపూడి, కన్నెగంటివారిపాలెం, ఓలేరు గొడపాలెం, తూర్పుపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో మెయింటినెన్స్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

14న జాతీయ లోక్ అదాలత్

రేపల్లె రూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం పట్టణంలోని కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్‌లతో పాటు బ్యాంక్ సంబంధిత కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థినికి సన్మానం



భట్టిప్రోలు: నవోదయకు ఎంపికై జెఈఈలో 99.85 శాతం మార్కులతో వరంగల్ ఎన్ఐటీలో సీటు సాధించి ప్రస్తుతం తృతీయ సంవత్సరం చదువుతున్న భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పూర్వ విద్యార్థిని దావూరి ఆగ్నేస్ థెరిస్సాను మంగళవారం విశ్వశాంతి యాజమాన్యం సత్కరించింది. థెరిస్సా 10 కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరు కాగా 10 కంపెనీలలోనూ ఆఫర్లు దక్కాయి. అందులో ఓ కంపెనీ ఏడాదికి రూ.70 లక్షల ప్యాకేజి ఇవ్వడం జరిగింది. థెరిస్సా పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ ఇచ్చారు. ఆమె తల్లి దావూరి వెంకట లలిత కుమారి భట్టిప్రోలు ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఫణి పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీజీపై రేపటి నుంచి శిక్షణా తరగతులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీజీపై మొదటి బ్యాచ్‌కు ఈ నెల 12, 13 తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెటర్నరీ, డిజిటల్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్ వెంకట రమణ మంగళవారం తెలిపారు. 2వ బ్యాచ్‌కు ఈ నెల 16, 17 తేదీలలో అగ్రికల్చర్, వెల్ఫేర్, ఎనర్జీ, ఫిషరీస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లు, ఏఎన్ఎంలకు శిక్షణా తరగతులు జరుగుతాయని అన్నారు. ఈ శిక్షణా తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన గాజులవర్తి కోటేశ్వరమ్మ తెలిసిన వాళ్ల దగ్గర అప్పు తీసుకుంది. తీసుకున్న అప్పు కంటే ఎక్కువ చెల్లించానని, అయినా ఇంకా చెల్లించాలని అప్పు ఇచ్చిన వాళ్లు అంటున్నారని వాపోతూ మంగళవారం పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అప్పు చెల్లించకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే సెల్ఫీ వీడియో తీసిందన్న వాదనా వినిపిస్తోంది. దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

- పూర్తికానిని భవనంలోనే కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



కాకర్లమూడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం

కాకర్లమూడి(వేమూరు): అంగన్‌వాడీ కేంద్రం అధ్వాన పరిస్థితిలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమూరు మండలంలోని కాకర్లమూడి గ్రామ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం నిలిచిపోయి అధ్వానంగా మారింది. వేమూరు మండలంలోని 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 15 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేశారు. 38 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కాకర్లమూడి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవన నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో భవనం పూర్తి కాలేదు. అసంపూర్తిగా ఉన్న భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బల్లలు కూడా లేవు. పిల్లలు మట్టి నేలపై కూర్చొని చదువుకుంటున్నారు. మట్టి నేలపై పట్టాలు వేసుకొని నిద్ర పోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పూర్తి చేయాలని ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా పట్టించుకోవడం లేదు. కాకర్లమూడి అంగన్‌వాడీ కేంద్రం కొన్ని సంవత్సరాల నుంచి ఇలాగే కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్లు పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి పోయింది. అధికారులు స్పందించి కాకర్లమూడి అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు కేటాయించి భవనం నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంచనా పంపించాం

కాకర్లమూడి అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరుకు అంచనా తయారు చేసి పంపించడం జరిగింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మాణ పనులు చేపడతాం.

– శాంతిశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, వేమూరు

అధికారుల నిర్లక్ష్యం



అంగన్‌వాడీ కేంద్రం కొన్ని సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరు చేసి నులు చేపట్టాలి.

– బొల్లిముంత వెంకటేశ్వర్లు, కాకర్లమూడి

ప్రత్యేక దృష్టి సారించాలి



కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి. మండలంలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలు భవనాలు లేకుండా ఉన్నాయి. వాటికి భవనాలు ఏర్పాటు చేయాలి.

– తాడికొండ శ్రీనుబాబు, కాకర్లమూడి

మహిళలను ఉచిత గ్యాస్‌తో మోసం

వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



చినపరిమిలో అధ్యక్షుడు పాముల రెడ్డితో సమన్వయకర్త వరికూటి



మోదుకూరులో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): మహిళలను ఉచిత గ్యాస్ పథకం ద్వారా మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి, మోదుకూరు, ఆలపాడు, తొట్టెంపూడి గ్రామాల్లో గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చినపరిమి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా తమ్మా పాములరెడ్డి, మోదుకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గంగిరెడ్డి అక్కిరెడ్డి, ఆలపాడు అధ్యక్షుడిగా కూచిపూడి లెనిన్, తొట్టెంపూడి అధ్యక్షుడిగా గాయం పిచ్చిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు మహిళలకు అనేక పథకాలు ఆశ చూపించి మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు కావస్తున్నా ఇంత వరకు మహిళలకు ఎలాంటి పథకాలు ఇవ్వలేదన్నారు. అలాగే రైతులు పండించిన పంటలకు గిట్టు బాటు ధర లేక రైతులు ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ము కుంటున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులాలు, మతాలతో సంబంధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. అలాగే రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించారని, రైతు భరోసా ద్వారా రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించి వినత పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. రైతులందరు అధిక సంఖ్యలో వచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనపరెడ్డి రాఘురామి రెడ్డి, అనపరెడ్డి వీరారెడ్డి, మాజీ సోసైటీ అధ్యక్షులు శివరామిరెడ్డి, దాట్ల మోహన్‌రెడ్డి, అనపరెడ్డి సాంబరెడ్డి, సర్పంచులు వుయ్యూరు వెంకట రెడ్డి, వుయ్యూరి అప్పిరెడ్డి, నాయకులు అవుతు ముత్తరెడ్డి, తమ్మా బసివిరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, సీనియర్ న్యాయవాది, మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన్ రెడ్డి, అరమళ్ల పెదకొటిరెడ్డి, పులివర్తి అశోక్ కుమార్, పామిడి రాజేష్, రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



భట్టిప్రోలు: టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని జరిపించాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు కోరారు. టీడీపీ భట్టిప్రోలు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మార్కెట్ రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని ఆ బాధ్యత తనదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు వెళుతుందని చెప్పారు. అనంతరం స్థానిక రైలుపేటలో 26 మంది చేనేత కార్మికులకు ముద్రా యోజన రుణాల కింద రూ.13 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అధికారి కె.నాగమల్లేశ్వరరావు, ఏడీవో పి.వెంకట్రావు, జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎస్.అరుణ, సూపర్‌వైజర్ వీవీడీవీ ప్రసాద్, నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, బట్టు మల్లిఖార్జునరావు, రాయన ప్రసాదరావు, వేములపల్లి జగన్నాధరావు, మోటూరు పుణ్య శ్రీనివాసరావు, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణలు తొలగించండి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



షిల్ట్ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట కొందరు ఇంటి యజమానులు ఇనుము, రాళ్లు, ఇతర భవన నిర్మాణ మెటీరియల్‌ను ఏర్పాటు చేసి నెలలు దాటుతున్న ఎందుకు వాటిని తొలగించటం లేదని మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ప్రశ్నించారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. మురుగు కాల్వలు వ్యర్థాలతో పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. పని తీరులో మార్పు రావాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సునీల్ కుమార్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కుర్చీలు, వంట సామాన్లు అందజేత



భట్టిప్రోలు: సహృదయ సేవా సంఘం ఆధ్వర్యంలో పాతకమూరి పాపయ్య 25వ వర్ధంతి పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో మంగళవారం భట్టిప్రోలు మండలంలోని పలు హైస్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, ఆట వస్తువులు, వంట సామాన్లు అందజేశారు. ఈ సందర్భంగా పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 10 కుర్చీలు, చింతమోటులోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులు, కుర్చీలు, వంట సామాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు ఎస్.రవీంద్రబాబు, నిర్వాహకులు అత్తోట డేవిడ్, రవీంద్రబాబు, వెంకటరత్నం, బి.సునీత, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం



పురస్కారంతో శివశంకర్‌కు సత్కారం

తెనాలి: వివిధ సంస్థలను నిర్వహిస్తూ ఎన్నోర కాలసేవలతో సమాజానికి తోడ్పడుతున్న సమాజ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవాభూషణ్ పురస్కారం సమంజసమని కాకినాడలోని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా మంగళవారం కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ టీం ఆధ్వర్యంలో అక్కడి 'డి' కన్వెన్షన్ హాలులో సేవాభూషణ్ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. వీరిలో తెనాలికి చెందిన సంఘసేవకుడు తన్నీరు శివశంకర్‌కు సేవారంగం నుండి సేవాభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాసు, ప్రధాన కార్యదర్శి జి.స్వామినాయుడు, జిల్లా కన్వీనర్ గూటూరు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తబిత రత్నకుమారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తిని కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని విద్యార్థులు కలిగి ఉండాలని ఆంధ్ర బెటాలియన్ అధికారి కల్నల్ జె.మహేష్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ విభాగంలో బీ, సీ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంగళవారం వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ క్రీడల రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండటం అభినందనీయమన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవీంద్రనాథ్, ఎన్‌సీసీ అధికారి కె.అశోక్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

గ్రీన్ అంబాసిడర్‌లకు సన్మానం



కర్లపాలెం: అందరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా సర్పంచ్ నక్కా లలితకుమారి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించి గ్రీన్ అంబాసిడర్‌లను సన్మానించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ని సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఇంకా కొద్ది మంది ఆరు బయట మల విసర్జనకు వెళుతున్నారన్నారు. ఆరు బయట మల విసర్జన వలన అంటువ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల గౌరవభావం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.రాంబాబు ఏఈ మంజూర్‌బాషా, ఈవోపీఆర్డీ ఎ.శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల బలోపేతానికి కృషి చేయాలి

ఎంపీడీవో శోభారాణి



గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శోభారాణి

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంతాల బలోపేతానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో ఎం.శోభారాణి అన్నారు. గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణా తరగతులను గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించి ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. పంచాయతీలలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని, ఆయా పనుల నిర్వహణకు అయ్యే ఖర్చుల వివరాలను రికార్డులలో నమోదు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, పంచాయతీ ద్వారా గానీ, ఉన్నతాధికారులకు నివేదించటం ద్వారా గానీ పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో గంగడిపాలెం, పేటేరు, రాజుకాల్వ, బేతపూడి-1, అరవపల్లి, మొళ్లగుంట పంచాయతీల ప్రజా ప్రతినిధులు, గ్రామ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం



సూరేపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

సూరేపల్లి(భట్టిప్రోలు): భూ వివాదాల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారానికి, 22 ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ సదస్సుల్లో స్వీకరించనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్టీజీఎస్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పరిధిలో భూ వివాదాలకు సంబంధించి 6 అర్జీలు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకట రమణ, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి టి.అనూరాధ, ఏవో జి.మీరయ్య, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వేంకటప్లాచార్యులు, ఆర్ఐ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, మండల సమాఖ్య ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, వీఆర్వోలు చొప్పర రవి, కాశీకృష్ణ, శివరామకృష్ణ, మండ్రు జక్రయ్య, లంకె సురేష్, గ్రామ పెద్దలు రావు చంద్రశేఖరరావు, వాకా శేషు, సబ్ రిజిస్ట్రార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి

ఎస్ఎస్ఎఫ్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ

భట్టిప్రోలు: హిందూ దేవాలయాల రక్షణ కోసం హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ కోరారు. మంగళవారం ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భట్టిప్రోలులో నిర్వహించిన సమావేశంలో సత్యన్నారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మ, దేవాలయాల రక్షణ, ఐక్యత కోసం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన విజయవాడలో శంఖారావం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం శౌర్య దివస్‌గా గీతా జయంతిని జరుపుకోవాలని కోరారు. అలాగే సాయంత్రం అన్ని దేవాలయాల్లో సామూహిక హారతులు ఇవ్వాలని పేర్కొన్నారు. హైందవ శంఖారావం స్టిక్కర్లు, కరపత్రాలను పంచి జన జాగరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమటి వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ కుక్కల రాజ్యలక్ష్మి, టీటీడీ మండల ధర్మ ప్రచారిణి బూర్లె అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలం

రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి



ఆటోనగర్ వద్ద ధాన్యం ఆరబెట్టిన రైతులతో సాంబిరెడ్డి

తెనాలి: దగా పడుతున్న ధాన్యం రైతులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి విమర్శించారు. తెనాలి రూరల్ మండలంలోని కంచర్లపాలెం, సోమసుందర పాలెం, కఠెవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లకు రైతులు అవసరమైన గోతాల, రవాణా సమస్యలను పరిష్కరించుకోవాలని, తగినన్ని గోతాలను అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం సేకరణ సమయంలో నమోదు చేసిన తేమ శాతానికి, మిల్లర్ల వద్దకు వెళ్లాక తీస్తే తేమ శాతం పెరగటం ఏమిటో రైతులకు అంతుబట్టటం లేదన్నారు. ఈ నెల 12వ తేదీన మళ్లీ తుఫాన్ హెచ్చరికతో రైతుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయనీ, దీన్ని ఆసరా చేసుకుని 75 కిలోల బస్తాను రూ.1350కే కొనుగోలు చేస్తూ రైతులను దళారులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డులో వెయ్యికి పైగా గోతాలు ఉన్నాగానీ, గ్రామాలకు సరఫరా చేయకపోవటం అన్యాయమన్నారు. రైతులు తరుగుకు సిద్ధంగా ఉన్నా, ధాన్యం ఎత్తే దిక్కు లేక పోవటం దారుణమన్నారు. ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఐ కోటేశ్వరరావుతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొల్లిపర: సైబర్ నేరాల పట్ల రైతులు, యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు నుంచి వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని ఎస్ఐ పి.కోటేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాల పట్ల అవగాహన వారోత్సవాలు సందర్భంగా మంగళవారం స్థానిక హైస్కూల్ విద్యార్థులతో మండల కేంద్రం కొల్లిపరలోని ప్రధాన రహదారులల్లో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు అధికారులమని మీకు లోన్ మంజూరు చేస్తామని, రుణ మాఫీ వస్తుందని కేవైసీ అప్డేట్ చేయాలని మీకు తెలియని లింకులు పంపిస్తే ఓ పెన్ చేయవద్దు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఓటీపీ షేర్ చేయడం, ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం వెతకడం, ఆన్‌లైన్ కస్టమర్ కేర్ నంబర్స్ వెతకడం మొబైల్ ఫోన్‌కి వచ్చే అనుమానిత లింక్స్ క్లిక్ చేయడం వంటివి చేస్తే మన అకౌంట్‌లో ఉన్న డబ్బులు ఖాళీ అవుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇటువంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.